సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం | 19 | మే | 2024

రాజన్నకు కోడెమొక్కులు



వేములవాడ: రాజన్నను శనివారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మ గుండంలోని నీటిని ఖాళీ చేస్తుండడంతో షవర్ల వద్ద స్నానాలు చేశారు. అనంతరం కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
33.0/27.0

వాతావరణం
వాతావరణం చల్లబడుతుంది. జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తాయి. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఫస్టియర్ 2,222, సెకండియర్‌లో 1,412 మంది
- జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలు
- డీఐఈవో మోహన్



సిరిసిల్లకల్చరల్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ 1 వరకు కొనసాగుతాయని, ఈమేరకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి చింతల మోహన్ తెలిపారు. ఫస్టియర్ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఫస్టియర్‌లో 2,222, సెకండియర్‌లో 1,412 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు వివరించారు. ఇద్దరు డీఈసీలు, 14 మంది చీఫ్ సూపరింటెండెంట్స్, 14 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, నలుగురు అదనపు సీఎస్‌లు, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్స్, ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఇద్దరు కస్టోడియన్స్‌ను నియమించినట్లు ప్రకటించారు.

రాజీయే రాజమార్గం

- జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ప్రేమలత



సిరిసిల్లకల్చరల్: పరిష్కరించుకోగలిగిన కేసుల విషయంలో రాజీయే రాజమార్గంలా పనిచేస్తుందని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఎస్.ప్రేమలత పేర్కొన్నారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులతో శనివారం సమావేశమయ్యారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో 900కు పైగా కేసులు రాజీ కుదిర్చేందుకు వీలుగా ఉన్నాయన్నారు. రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు చొరవ చూపించాలని అధికారులకు సూచించారు. జూన్ 8న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్, వివిధ మండలాల పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీ తగ్గించొద్దు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): టెక్స్‌టైల్ పార్కులో బతుకమ్మ చీరల 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులు తగ్గించొద్దని కోరుతూ టెక్స్‌టైల్ పార్కు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పార్కు డీవో మోహిజ్‌కు శనివారం వినతిపత్రం అందించారు. కోడం రమణ, కూచన శంకర్, జెల్ల సదానందం, అక్కల శ్రీనివాస్, మేఘ ఆంజనేయులు, రాజశేఖర్, శ్రీనివాస్, లహిక్ అహ్మద్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

రాజన్న కోడెలకు పశుగ్రాసం అందజేత



వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ నాంపల్లి శివారులోని రాజన్న గోశాలలోని కోడెలకు వివిధ గ్రామాల రైతులు వరిగడ్డిని శనివారం ఉచితంగా అందజేశారు. పశుగ్రాసం అందించే రైతులు ఉదయం 6.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నాంపల్లి శివారులోని గోశాలకు తీసుకురావాలని అధికారులు తెలిపారు.

గడువులోగా దుస్తులు అందివ్వాలి

- అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జూన్ 5లోగా స్కూల్ యూనిఫామ్ అందివ్వాలని అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్ మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో యూనిఫామ్ కుడుతున్న వారిని శనివారం పరిశీలించి పలు సూచనలు చేశారు. మిషన్లు అవసరం మేరకు కొనుగోలు చేసుకోవాలని సూచించారు. డీపీఎం సుధారాణి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట ఏపీఎంలు మల్లేశం, సుదర్శన్, టీసీ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్‌మానేరు.. డెడ్‌స్టోరేజీ!

- ఐదు టీఎంసీలకు పడిపోయిన నీటిమట్టం
- గతేడాది మే నెలలో 20 టీఎంసీలు
- ప్రస్తుతం అడుగంటిన నీటినిల్వలు
- వర్షాలపైనే ఆశలు



నీరు లేక వెలవెలబోతున్న మిడ్‌మానేరు ప్రాజెక్టు

బోయినపల్లి(చొప్పదండి): కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయ వంటి మిడ్‌మానేరు ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి చేరుకుంది. గతేడాది మే నెలలో నిండుగా జలకళతో కనిపించిన ప్రాజెక్టు ప్రస్తుతం నీరు అడుగంటి వెలవెలబోయి కనిపిస్తుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 5.72టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టులో 6.23 టీఎంసీలు ఉంటే డెడ్‌స్టోరేజీకి చేరినట్లుగా అధికారులు భావిస్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా లేకపోవడం, తాగునీటి అవసరాల కోసం ఎల్‌ఎండీకి, మిషన్‌భగీరథకు సరఫరా అవుతుండడంతో నీటి నిల్వలు పడిపోయాయి.

వచ్చింది.. వచ్చినట్లే..

మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి 2023 జూన్ 1 నుంచి కాళేశ్వరం, ఎస్సారెస్పీ, వరదల ద్వారా 45.017 టీఎంసీల మేర నీరు ఇన్‌ఫ్లోగా వచ్చింది. ఇందులో నుంచి కరీంనగర్ ఎల్‌ఎండీకి 49.390, కుడికాల్వకు 4.804, ఎడమకాల్వకు 0.125 టీఎంసీల మేర నీరు విడుదల చేశారు. 2019లో మిడ్‌మానేరు కట్ట సీపేజీ మరమ్మతులతో ప్రాజెక్టులో ఉన్న నీరు మొత్తం ఎల్‌ఎండీకి వదలడంతో అప్పుడు 2.50 టీఎంసీలు మాత్రమే నీటి నిల్వ ఉంది. ఎండలకు రోజుకు 95 క్యూసెక్కుల మేర నీరు ఆవిరి అవుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతీ రోజు మిషన్ భగీరథ పథకానికి విడుదల చేసే నీరు కన్నా ఆవిరి అవుతున్న నీరు ఎక్కువ ఉండడం ఎండల తీవ్రతకు నిదర్శనమని అధికారులు పేర్కొంటున్నారు.

మిషన్‌భగీరథకు 50 క్యూసెక్కులు

మిడ్‌మానేరు నుంచి సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లోని సుమారు 466 గ్రామాలకు మిషన్‌భగీరథ పథకానికి రోజుకు 50 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేస్తున్నారు. వేములవాడ నియోజకవర్గ పరిసరాల్లో ఉండే జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాలకు సైతం నీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో ఎండలకు నీరు ఆవిరి కావడం, మిషన్ భగీరథ పథకానికి నీరు విడుదల చేయడం తప్ప ఇతరత్రా ఏ అవసరాలకు నీరు విడుదల చేయడం లేదు.

వర్షాలపైనే ఆధారం

మిడ్‌మానేరు ప్రాజెక్టు నీటితో కళకళలాడాలంటే వర్షాలే ఆధారమని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, కాళేశ్వరం ప్రాజెక్టు జలాలు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో మరో నెల తర్వాత కురిసే వర్షాలపైనే మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి నీరు చేరడం ఆధారపడి ఉంది. వర్షాలు సమృద్ధిగా కురిస్తే ప్రాజెక్టులోకి నీరు చేరే అవకాశం ఉంటుంది. లేదంటే మిషన్ భగీరథ పథకానికి, వానాకాలం ఆయకట్టుకు నీరు అందించడం కష్టసాధ్యం కానుంది.

ప్రాజెక్టు నీటి సామర్థ్యం : 27.55 టీఎంసీలు
ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ : 6.23 టీఎంసీలు
ప్రస్తుతం ఉన్న నీరు : 5.72 టీఎంసీలు
ప్రాజెక్టు నిండుగా ఉంటే బ్యాక్ వాటర్ : 18 కిలోమీటర్లు
ప్రస్తుతం ఉన్న బ్యాక్ వాటర్ : 5 కిలోమీటర్లు
మిషన్ భగీరథకు నీటి విడుదల : 50 క్యూసెక్కులు
ఆవిరి అవుతున్న నీరు : రోజుకు 95 క్యూసెక్కులు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- ధాన్యాన్ని పరిశీలించిన బీజేపీ నాయకులు



వేములవాడ శివారులో ధాన్యం పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల/వేములవాడ: జిల్లాలో రైతులు శ్రమించి పండించిన పంటను వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పార్టీ పార్లమెంట్ కో–కన్వీనర్ ఆడెపు రవీందర్ కోరారు. సిరిసిల్ల శివారులోని చంద్రంపేట, రగుడు, చిన్నబోనాల, పెద్దబోనాల బైపాస్‌రోడ్డు, వేములవాడ బైపాస్‌రోడ్లపై ఉన్న ధాన్యం రాశులను శనివారం పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. అధికారుల నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తడిసిన వడ్లను మళ్లీ ఆరపెట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా తడిసిన ధాన్యం కొనాలని, క్వింటాల్‌కు రూ.500 బోనస్ వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని కోరారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణ అధ్యక్షులు నాగుల శ్రీనివాస్, రేగుల సంతోష్‌బాబు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు సుంకరి బాలకిషన్, జిల్లా అధికార ప్రతినిధి బర్కం నవీన్ యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొండ నరేశ్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బండారి వెంకటేశ్వర్లు, గాజుల సదానందం, సుంకోజు రమేశ్‌చారి, తాటిపాముల సత్యం, సంటి మహేశ్, కోల కృష్ణస్వామి, గోపు బాలరాజు, మైలారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు హెల్త్ క్యాంపు



సిరిసిల్ల ఎడ్యుకేషన్: ఆర్టీసీ ఉద్యోగులకు మూడు రోజులపాటు నిర్వహించే హెల్త్‌క్యాంపును సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో డిప్యూటీ సూపరింటెండెంట్ తడుక సాయికుమార్ ప్రారంభించారు. ఉద్యోగులు ఆరోగ్యం కాపాడుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా, మెడిటేషన్ చేయాలని సూచించారు. డిపోమేనేజర్ మనోహర్ మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్యరీత్యా ఏర్పాటు చేసిన క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రాఫిక్ ఇన్‌చార్జి ఎల్.సారయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్ నక్క శ్రీనివాస్, మెకానికల్ సూపర్‌వైజర్ ఏకే ఖాన్, సేఫ్టీ వార్డెన్, ఎల్‌ఆర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, వెల్ఫేర్ బోర్డు సభ్యుడు నర్సయ్య, మల్లేశం, హెల్త్ వలంటీర్ బి.సునీత తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి




వీసీలో పాల్గొన్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ గౌతమి

- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి
- 15 సెంటర్లు.. 4,699 మంది అభ్యర్థులు
- సర్వం సిద్ధం..
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లకల్చరల్: గ్రూప్–1 ప్రిలిమనరీ పరీక్షలు జూన్ 9న పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహజన్, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పాల్గొన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్‌కు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాన్ని ఒక రోజు ముందుగానే అభ్యర్థులు పరీక్షించుకోవాలని సూచించారు. తొమ్మిది గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తారని, 10 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 15 పరీక్ష కేంద్రాల్లో 4,699 మంది హాజరుకానున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలతోపాటు లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించినట్లు వివరించారు.

పది రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి చేస్తాం

- ఇప్పటికే 2,08,566 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 28,612 మంది రైతుల ఖాతాల్లో రూ.344 కోట్లు జమ
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో మరో పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై శనివారం మాట్లాడుతూ గతంలో కంటే ముందుగానే ఏప్రిల్ ఒకటో తేదీన కొనుగోళ్లు ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 31,201 మంది రైతుల నుంచి 2,08,566 మెట్రిక్ టన్నుల ధాన్యం కొని 2,02,125 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించినట్లు వివరించారు. వడ్లను అమ్మిన 28,612 రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.344కోట్లు జమ చేసినట్లు తెలిపారు. అకాల వర్షాలు, ఎండలు, ఇతర కారణాలతో క్షేత్ర స్థాయిలో కొద్దిగా ప్రతికూల పరిస్థితులు ఉన్నా పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లను పది రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లను పూర్తి స్థాయిలో చేపడతామని స్పష్టం చేశారు.

తంగళ్లపల్లి(సిరిసిల్ల): నేరేళ్ల కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు త్వరగా ముగించడంపై ఆ గ్రామ రైతులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ గ్రామానికి వెళ్లగా ఈమేరకు అన్నదాతలు కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామంలో ముందస్తుగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యం సేకరించి, డబ్బులు ఖాతాల్లో వేయించడంతో ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో సిద్ధం కావాలి

- ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సంకశాల



మాట్లాడుతున్న ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేశం

వేములవాడఅర్బన్: విద్యార్థులు ఉద్యోగ పోటీపరీక్షలలో విజయం సాధించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి సంకశాల మల్లేశం కోరారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆర్థిక సహాయ సహకారాలతో కళాశాల అకాడమిక్ సెల్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే నిరంతరం సాధన చేస్తే తప్పక లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. నేటి యువత టీవీ, సెల్‌ఫోన్, సినిమా వంటి మాధ్యమాలకు బానిస కావడం బాధాకరమన్నారు. 2020–23 విద్యా సంవత్సరంలో అకాడమిక్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులకు బంగారు పతకాలు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు మధురాజేశ్, మల్లారెడ్డి, పూర్వ విద్యార్థులు రాధా కృష్ణమాచార్యులు, సత్యనారాయణరెడ్డి, జయవర్ధన్ ఉన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

- కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు
- భారీగా హాజరవుతున్న చిన్నారులు
- జూన్ 3న ముగింపు



అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు



యోగాలో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు

సిరిసిల్లకల్చరల్: ఒకరు విల్లు ఎక్కుపెడితే.. మరొకరు పరుగెత్తుతున్నారు.. ఇంకొకరు యోగాతో ఆరోగ్యభాగ్యం అంటున్నారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లోని మినీస్టేడియంలో ఈనెల 1 నుంచి మొదలైన ఉచిత శిక్షణ జూన్ 3 వరకు కొనసాగనుంది. ఒక్కో క్రీడాంశంపై ఒక్కో కోచ్ శిక్షణ ఇస్తున్నారు. చిన్నారులు ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

క్రీడాంశాలు ఇవే..

బాస్కెట్‌బాల్, క్రికెట్, కరాటే, ఆర్చరీ, యోగా, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ ఉచిత శిక్షణ తరగతులకు 565 మంది వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. నిత్యం 250 మంది వరకు హాజరవుతున్నారు. కబడ్డీలో ఎస్.తిరుపతిరెడ్డి, క్రికెట్‌లో బి.సంతోష్, కరాటేలో ఎంఏ మన్నార్, అథ్లెటిక్స్‌లో కె.శ్రీనివాస్, వాలీబాల్‌లో పి.ప్రభాకర్, డి.రాకేశ్, టి.సురేశ్, ఎస్.అనిల్‌కుమార్, కె.నరేశ్, ఆర్చరీలో పి.ప్రశాంత్ శిక్షణ ఇస్తున్నారు.

పది ప్రాంతాల్లో శిక్షణ శిబిరాలు

జిల్లా కేంద్రం సిరిసిల్లతోపాటు మరో తొమ్మిది ప్రాంతాల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి, రుద్రవరం, బోయినపల్లి, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలం ఆవునూర్, రుద్రంగి, కోనరావుపేట మండలం నాగారం, ఇల్లంతకుంట మండల కేంద్రాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. నిత్యం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు తిరిగి సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు శిక్షణ కొనసాగుతోంది. ఒక్కో శిబిరానికి ఒక్కో ఉపాధ్యాయున్ని నియమించారు. వారి నేతృత్వంలో ఆయా క్రీడాంశాల్లో శిక్షణ కొనసాగిస్తున్నారు. నెల రోజుల శిక్షణ కాలానికి శిక్షకులకు తగిన పారితోషికం కూడా అందజేస్తామని జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి అజ్మీర రాందాస్ తెలిపారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు పారితోషికం నిర్ణయించనున్నట్లు వెల్లడించారు.



గురి కుదిరింది..



రన్..రన్

సద్వినియోగం చేసుకుంటున్నారు



విద్యార్థులు వేసవి సెలవులను ఉచిత శిక్షణ శిబిరాలతో సద్వినియోగం చేసుకుంటున్నారు. స్పందన బాగుంది. 250 మందికిపైగా విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు. శిబిరాల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, శారీరక, మానసిక వికాసం పెంపొందుతాయి. జూన్ 3వ తేదీన శిక్షణ శిబిరాలు ముగుస్తాయి.

– అజ్మీర రాందాస్, జిల్లా యువజన క్రీడల అధికారి

శిక్షణ ఉపయోగకరం



వాలీబాల్‌లో శిక్షణ తీసుకుంటున్న. క్రీడాకారుడిగా ఎదగాలనేనా ఆకాంక్షకు శిబిరంలో అందిస్తున్న శిక్షణ ఉపయోగకరంగా ఉంది. కోచ్‌లు సైతం స్నేహపూర్వకంగా నేర్పిస్తున్నారు.

– లచ్చపేట అశోక్, గూడెం

క్రమశిక్షణ పెంపొందుతుంది



బాస్కెట్‌బాల్‌లో శిక్షణ తీసుకుంటున్నా. క్రమశిక్షణతో కూడిన జీవితం అలవాటు పడుతుంది. క్రీడాస్ఫూర్తి పెంపొందుతుంది. శాస్త్రీయమైన శిక్షణతో నచ్చిన క్రీడల్లో రాణించేందుకు శిబిరాలు దోహదం చేస్తాయి.

– గొట్టిముక్కల సంతోష్, బాస్కెట్‌బాల్

స్పందన బాగుంది



ప్రభుత్వ నిర్వహణలో అందిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో యోగాకు స్పందన బాగుంది. యోగాసనాల సాధన ప్రక్రియకు విద్యార్థుల నుంచి స్పందన లభిస్తోంది. యోగాతో విద్యార్థుల్లో మంచి ధారణ, జ్ఞాపకశక్తి, ఏకాగ్రతలు పెంపొందుతాయి.

– ఉప్పుల శ్రీనివాస్, యోగాచార్యుడు

ఇసుక రీచ్‌ను అడ్డుకున్న రైతులు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లిలో ఏర్పాటు చేసిన ఇసుకరీచ్‌తో తమ భూములు కోతకు గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని మామిడిపల్లి మూలవాగునుంచి ఇసుకను తరలించేందుకు రెవెన్యూ అధికారులు శనివారం అనుమతులు ఇచ్చారు. దీంతో ట్రాక్టర్లు మూలవాగుకు రాగా పరివాహక రైతులు ఇసుకతరలింపును అడ్డుకున్నారు. ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి ఇసుకరీచ్‌ను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆర్‌ఐ రాజశేఖర్, కానిస్టేబుళ్లు చేరుకుని రైతులతో మాట్లాడారు. వాగు మధ్యలో నుంచి ఇసుక తీసుకెళ్లాలని సూచిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. లోకుర్తి లింబయ్య, శంకర్, బుర్ర రాజేశం, లోకుర్తి అంజయ్య, పెద్దోళ్ల శంకర్ పాల్గొన్నారు.



చెదిరిన ఆక్వాహబ్ కల

సిరిసిల్ల: మిడ్‌మానేరులో ఆక్వాహబ్ ఏర్పాటుతో మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్థానిక యువత ఆశపడింది. కానీ ప్రస్తుతం మిడ్‌మానేరు అడుగంటిపోవడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆక్వాహబ్ ఏర్పాటుకు ముందుకొచ్చిన మూడు కంపెనీలు వెనక్కి తగ్గాయి. ఫలితంగా యువతకు ఉపాధి అవకాశాలు దూరమవుతున్నాయి. –వివరాలు 10లో..

ఈఏపీసెట్ ఫలితాల్లో 'అల్ఫోర్స్'కు అత్యున్నత ర్యాంకులు



అల్ఫోర్స్ ఎంసెట్ టాపర్స్‌తో అధినేత నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ(ఈఏపీసెట్)–2024 ఫలితాల్లో కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచి అద్భుత ర్యాంకులతో అగ్రస్థానంలో నిలిచినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను బొకేలతో ఆయన సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వీఎన్ఆర్ మాట్లాడుతూ.. అల్ఫోర్స్‌కు చెందిన విద్యార్థులు వి.హాసిని 114వ ర్యాంకు, ఎస్.హేమంత్ 157, జి.శ్రీహాస్ 166, కె.సుప్రియ 296, ఎస్.జ్ఞానద 480, వి.శ్రీముఖి 568, ఎం.వర్షిత్ 575, జి.సాయిమంజునాథ్‌రెడ్డి 610, పి.జ్యోతిర్మయిరెడ్డి 863, శ్రీవెన్నెల 876, తేజస్విని 942, ఎ.శివవరుణ్ 973, సీహెచ్ అనూహ్య 950, పి.శ్రీనాథ్ 986, మలిహాఫాతిమా 992వ ర్యాంకు సాధించారన్నారు. 16 మంది విద్యార్థులు వెయ్యి లోపు ర్యాంకులు, 39 మంది 2వేల లోపు ర్యాంకులు, 63 మంది 3వేల లోపు ర్యాంకులు, 116 మంది 5వేల లోపు ర్యాంకులు సాధించి అల్ఫోర్ కీర్తిప్రతిష్టలను దశదిశలా చాటడం గర్వంగా ఉందన్నారు. తక్కువ మంది విద్యార్థులతో అత్యధిక ర్యాంకులు సాధించడం అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమని ఈ ఫలితాలు తెలియజేస్తున్నాయని తెలిపారు. ఇటీవల ప్రకటించబడిన ఐఐటీ మెయిన్స్ ఫలితాల్లో అల్ఫోర్స్ చారిత్రాత్మక విజయం సాధించిందని, 450 మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని చెప్పారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషి ఫలితంగా అల్ఫోర్స్ ఘనవిజయాలు సాధిస్తోందని పేర్కొన్నారు. రాబోయే ఐఐటీ అడ్వాన్స్, నీట్ ఫలితాల్లో మహోన్నత ర్యాంకులతో ముందంజలో ఉంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ట్రినిటి' అద్భుత ఫలితాలు


విద్యార్థులను అభినందిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఈఏపీసెట్ 2024 ఫలితాల్లో ట్రినిటి జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కళాశాలల ఫౌండర్ చైర్మన్, పెద్దపల్లి మాజీ శాసన సభ్యుడు దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన జె.హనికర్ అత్యుత్తమంగా 44వ ర్యాంక్ సాధించి సత్తా చాటినట్లు పేర్కొన్నారు. పి.ప్రణయ్ 773, వై.ఆశ్లేష 1254, వి.శ్రీతేజ 1255, వై.అశ్విత 1551, సీహెచ్ విఘ్నేశ్ 1624, అయేషా 1627, ఫిల్జా అతీక్ 1748, ఎస్.శ్రీలక్ష్మీ 2159, ఎం.హర్షవర్ధన్ 2280, ఎస్.గంగశ్రీ 2372, పి.శ్రీదీప 2682, సీహెచ్ రంజిత 2815, మదిహా ఫాతిమా 2913, ఎం.ఆశిష్ 2954, కె.రాణి 2998 ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. 10వేల లోపు ర్యాంకులను చాలామంది విద్యార్థులు కైవసం చేసుకున్నారన్నారు. అత్యుత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను శనివారం ఆయన అభినందించారు. విద్యార్థులను కళాశాలల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తోపాటు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

'ఎస్ఆర్' విజయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న నేదూరి తిరుపతి

తిమ్మాపూర్: రాష్ట్రంలో ఇంజినీరింగ్ అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈఏపీసెట్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో కరీంనగర్ జిల్లా ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కరీంనగర్ ఎస్సార్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి తెలిపారు. తమ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివిన తుమ్మ తేజస్వి 161 ర్యాంకు, ముంకల గణేశ్ 199, కటంకూరి శ్రీనివాసరెడ్డి 291, రావుల దీపాన్షురెడ్డి 412, గడ్డం రాజీవ్ 552, సాయిచంద్ర 565తోపాటు మరో 12 మంది వెయ్యి లోపు ర్యాంకులు, మరో 20 మంది 5వేల లోపు ర్యాంకులు సాధించారని వివరించారు. అగ్రికల్చర్‌లో మధులికరెడ్డి, లక్ష్మీప్రసన్న, అశ్విత రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించారని తెలిపారు. విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్ మధూకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి తిరుపతి, అకాడమిక్ డీన్ రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు నాగార్జునరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మారుతి, శ్రీనివాసరెడ్డి అభినందించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని కొండాపూర్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం విచారణ చేపట్టారు. కొండాపూర్‌కు చెందిన గౌరి కన్నయ్య తనను ఇదే గ్రామానికి చెందిన తుపాకుల శ్రీనివాస్‌గౌడ్ కులం పేరుతో దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, సాక్షుల వాంగ్మూలం తీసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్సై శేఖర్‌రెడ్డి ఉన్నారు.

డీజిల్ కుంభకోణంపై రీజినల్ డైరెక్టర్ విచారణ

వేములవాడ: వేములవాడ మున్సిపాలిటీలో 2022లో డీజిల్ కుంభకోణానికి పాల్పడిన అప్పటి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నగేశ్‌పై మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ శనివారం విచారణ చేపట్టారు. డీజిల్ కుంభకోణానికి పాల్పడిన నగేశ్‌ను ఆ సమయంలో కలెక్టర్ సస్పెండ్ చేశారు. అయితే శాఖాపరమైన చర్యల్లో భాగంగా రీజినల్ డైరెక్టర్ విచారణకు వచ్చారు.

శతాధిక వృద్ధుడి మృతి


రామయ్య(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మండలం మల్కపేటకు చెందిన గెంటె రామయ్య(103) వృద్ధాప్య కారణాలతో శనివారం మృతిచెందాడు. ఆయనకు నాలుగు తరాల కుటుంబసభ్యులు ఉన్నారు. రామయ్య భార్య గత కొన్నేళ్ల క్రితమే చనిపోయింది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం.

8 నుంచి జిల్లాస్థాయి శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న రమేశ్


వేములవాడ: సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు వేములవాడలో జూన్ 8 నుంచి 10 వరకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముష్కం రమేశ్ తెలిపారు. వేములవాడలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి ఎంపిక చేసిన 100 మంది ముఖ్య నాయకులకు రాష్ట్ర పార్టీ నాయకులు శిక్షణనిస్తున్నట్లు చెప్పారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎరవెల్లి నాగరాజు, ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, మల్లారపు ప్రశాంత్, గురిజాల శ్రీధర్, నాయకులు గణేష్, అశోక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా.. పర్యాటక ఖిల్లా

ఎన్నో చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలు..

- భక్తులు, పర్యాటకులను ఆకర్షిస్తున్న వైనం
- చూసొద్దాం.. రండి

కరీంనగర్: ఒకప్పుడు కల్లోల ప్రాంతాలతో ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేడు పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. దేశంలోనే పేరెన్నిక గన్న సిల్వర్ ఫిలిగ్రీతోపాటు నాణ్యమైన నల్ల బంగారు గనులకు ప్రసిద్ధి పొందింది. ఎన్నో చారిత్రక స్థలాలు, కట్టడాలు, ఆధ్యాత్మికతను పరిమళింపజేసే ఆలయాలు ఆకర్షిస్తున్నాయి. దర్శించుకోవాలంటూ పర్యాటకులు, భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. వాటిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



కొండల మధ్య రాముని గుండాలు

రామగుండం నుంచి 2 కిలోమీటర్ల దూరంలో కొండల మధ్య ముచ్చగొలిపే చారిత్రక ప్రాంతం రాముని గుండాలు. కొండపైకి ఎక్కి చూస్తే కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలను కలిపే గోదావరినది, బొగ్గు గనులు, విద్యుత్ కేంద్రం కనువిందు చేస్తాయి.



నాలుగు నూర్ల దేవాలయాలు.. నగునూరు

కరీంనగర్ జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగునూరులో పూర్వం చాళుక్యులు, కాకతీయుల సామంతరాజులు 4 గుట్టలను కలుపుతూ కోటను నిర్మించి, పరిపాలన సాగించారు. బౌద్ధుల కాలం నాటి శాసనాలు, విగ్రహాలు, స్మారక చిహ్నాలు ఉన్నాయి. గంగాధరుడు నిర్మించిన త్రికూటాలయం నాటి శిల్పకళా ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది. ఒకప్పుడు 400 దేవాలయాలు ఉండేవని, నాలుగు నూర్ల దేవాలయాలు ఉన్న ఊరు కాస్త నగునూరుగా స్థిరపడిందని చరిత్ర చెబుతోంది. గ్రామం వెలుపల అతిసుందరమైన పెద్ద నాగశిల్పం ఉంది. హైదరాబాద్‌కు చెందిన కాసుగంటి నారాయణరావు ట్రస్టు ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో పురాతన ఆలయాల పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి.

దక్షిణకాశీ.. వేములవాడ

కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఆదాయంలో తిరుపతి తర్వాత రెండోది. దక్షిణకాశీగా కీర్తిగాంచిన ఈ ఆలయాన్ని కళ్యాణి చాళుక్య వంశీయుడైన ఆరో విక్రమాదిత్యుడు వెయ్యేళ్ల క్రితం నిర్మించాడని శాసనాలు చెబుతున్నాయి. కోడె మొక్కు ఆచారం ఇక్కడ తప్ప రాష్ట్రంలో మరెక్కడా లేదు. మతసామరస్యానికి ప్రతీకగా దర్గాతోపాటు జైన దేవాలయాలు ఇక్కడ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

సైఫన్.. నాగులపేట



కోరుట్లకు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాగులపేట సైఫన్ ఆసియా ఖండంలోనే అరుదైన నిర్మాణంగా కీర్తిగాంచింది. భూగర్భంలోకి కాలువలోని నీరు మాయమై, వాగు దాటాక తిరిగి ప్రత్యక్షమవుతుంది. కింద కాలువ, పైన వాగు ఉండటం ఈ సైఫన్ ప్రత్యేకత.

కోర్కెలు తీర్చే అంజన్న.. కొండగట్టు

మల్యాల మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు. కరీంనగర్‌కు 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. 300 ఏళ్ల కింద ఈ ఆలయం నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఇప్పుడున్న గుడి మాత్రం 160 ఏళ్ల కింద కృష్ణారావు దేశ్‌ముఖ్ నిర్మించారు. భక్తుల కోర్కెలు తీర్చే దేవునిగా ఆంజనేయస్వామి పేరు పొందారు. కొండల రాయుని కోట, గుహలు, బొజ్జ పోతన, సీతమ్మవారి కన్నీటి గుంటలు చూడదగినవి.

వందేళ్ల నాటి ఎలగందుల ఖిల్లా

కాకతీయులు, బహమనీలు, కుతుబ్‌షాహీలు, మొగలులు, అసఫ్‌జాహీలకు రాజధానిగా విలసిల్లిన ఎలగందుల కరీంనగర్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడి కోట కొండపై మసీదు ఉంది. దాని మీనార్ ఒకటి కదిపితే కదులుతుందని అంటారు. లోపల బంగారు రంగు చిత్రాలు చూపరులను ఆకర్షిస్తాయి.

బౌద్ధ స్తూపం.. ధూళికట్ట

ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామం కరీంనగర్‌కు 28 కిలోమీటర్ల దూరంలో ఉంది. 1975 నుంచి 77 వరకు జరిపిన తవ్వకాల్లో నాటి కోట, బౌద్ధ స్తూపం బయటపడ్డాయి. కోట ముఖద్వారం వద్ద రాగి నాణేలు, మట్టి బొమ్మలు దొరికాయి.

శాతవాహనుల రాజధాని.. కోటిలింగాల

శాతవాహనుల రాజధాని కోటిలింగాల. వెల్గటూర్ మండలానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో ఎక్కడ చూసినా శివలింగాలు, శిల్పకళా ఖండాలు, ఖండాల ఖండికలు కనిపిస్తుంటాయి. పురవాస్తు శాఖవారు జరిపిన తవ్వకాల్లో శాతవాహనుల హయాంలోని నాణేలు, ఇతర స్మారక చిహ్నాలు వెలుగుచూశాయి. ఇక్కడి గోదావరినది నడి ఒడ్డున శ్రీకోటేశ్వరస్వామి ఆలయం ఉంది.

త్రివేణి సంగమ క్షేత్రం.. కాళేశ్వరం




కరీంనగర్‌కు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాళేశ్వరం.. శ్రీశైలం, ద్రాక్షారామం అంతటి విశిష్టమైంది. గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు సంగమించే చోటిది. ప్రధాన ఆలయంలో కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి లింగాలు ఒకే పానపట్టంపై ఉండటం విశేషం. ఇక్కడి లింగంపైన గల నాసికలో ద్రవం పోస్తే త్రివేణి సంగమంలో కలుస్తుందని ప్రతీతి. ప్రధాన ఆలయానికి కిలోమీటర్ దూరంలో ముక్తీశ్వరాలయం ఉంది. దీని చుట్టూ ఉన్న చిన్నచిన్న రాళ్లలో నుంచి విభూది రాలడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

నృసింహుని క్షేత్రం.. ధర్మపురి

కరీంనగర్‌కు ఉత్తరాన 70 కిలోమీటర్ల దూరంలో ధర్మపురి నృసింహుని క్షేత్రం ఉంది. అర్ధాయుష్కుడైన కుమారుడి కోసం బలివర్మ మహారాజు దేవతాయాగం చేసి, విజయం సాధించడం, ప్రజలు ధర్మబద్ధంగా జీవించడం కారణంగా ధర్మపురిగా వాసికెక్కింది. పద్మాసనంలో లక్ష్మీ సమేతుడై వెలసిన నరసింహస్వామితోపాటు, రామలింగేశ్వరాలయం పక్కపక్కనే ఉండి శైవ, వైష్ణవ సమ్మేళనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

వీరభద్రస్వామి.. కొత్తకొండ

భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ మీసాల వీరభద్రస్వామి దేవస్థానం అతి పురాతనమైంది. కాకతీయ రుద్రేశ్వరుని కాలం క్రీ.శ. 1410లో మల్లికార్జున పండితుని మనవడైన కేదారిచే ఆలయ నిర్మాణం జరిగింది. ఏటా సంక్రాంతికి జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.



రాజ భవనాలు.. రామగిరి ఖిల్లా

పెద్దపల్లికి 20 కిలోమీటర్ల దూరంలో గోదావరినదీ తీరాన శత్రుదుర్భేద్యమైన రామగిరి ఖిల్లా ఉంది. ఇక్కడి కోటలో సీతారామలక్ష్మణలు కొంతకాలం నివసించి చాతుర్మస్య వ్రతం ఆచరించినట్లు స్థానికులు చెప్పుకుంటారు. కోట లోపల గల అనేక రాజ భవనాలు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి. ఇక్కడి ప్రకృతి సౌందర్యానికి ఆకర్షితుడైన ఔరంగజేబు దీన్ని ఆరామ్ గిరి అని పిలిచారంటారు.

మరికొన్ని ఆలయాలు..

సారంగాపూర్ మండలంలోని పెంబట్ల గ్రామంలో దుబ్బ రాజేశ్వరస్వామి, ఓదెల మల్లికార్జునస్వామి, ఇల్లంతకుంట మండలంలోని జంగంపల్లి శ్రీరామలింగేశ్వర స్వామి, గంగాధర మండలంలోని నందగిరి లక్ష్మీనర్సింహస్వామి, రాయికల్‌లోని కేశవనాథ పంచముఖ లింగేశ్వర త్రికూట ఆలయాలు, కోరుట్ల మండలంలోని నాగులపేట సైఫన్, మొలంగూరు ఖిల్లా సందర్శించదగినవి.

సైనిక స్థావరం.. జగిత్యాల ఖిల్లా

కరీంనగర్‌కు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న జగిత్యాల ఖిల్లాను జాఫరుద్దౌలా హయాంలో ఫ్రెంచ్ ఇంజినీర్లు నిర్మించారు. 20 ఎకరాల విస్తర్ణంలో పూర్తిగా రాతితో నిర్మించిన ఈ ఖిల్లా నాడు సైనిక స్థావరంగా ఉండేది. ఇప్పటికీ చెక్కు చెదరకుండా చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది.

పురావస్తు ప్రదర్శన శాల

కరీంనగర్ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న పురావస్తు ప్రదర్శన శాలను 1964లో నెలకొల్పి, 1984లో ఆధునీకరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తవ్వకాల్లో వెలుగుచూసిన శాతవాహనులు, కాకతీయులు, అసఫ్‌జాహీల చిహ్నాలు, నాణేలు, స్టాంపులు, యుద్ధ సామగ్రి, పుణ్యక్షేత్రాల అవశేషాలను ఇక్కడ ఉంచారు.

మంత్రపురి.. మంథని

అనాదిగా వైదిక సంస్కృతి వైభవాన్ని పరిరక్షిస్తున్న మంత్రపురి ప్రస్తుతం మంథనిగా పిలువబడుతోంది. కరీంనగర్‌కు 70 కిలోమీటర్ల దూరంలో గోదా వరి నదీతీరాన వెలసిన గౌతమేశ్వరాలయంలోని బ్రాహ్మణోత్తములు వేదాధ్యయనంలో మేటిగా నిలిచారు. అప్పట్లో మంథనికి వాస్తు అక్కరలేకుండా నాలుగు దిక్కులా 4 శివలింగాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతం వాటిని దాటి, విస్తరించింది.

రామాలయం.. ఇల్లందకుంట



హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని ఇల్లందకుంట మండల కేంద్రంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ఉంది. దండకారణ్యంలో వవవాసం చేస్తున్న సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రుడు ఈ ప్రాంతానికి చేరుకున్నారని, దశరథుని మరణవార్త తెలిసి ఇల్లంద గింజలతో తర్పణం వదిలారని ప్రతీతి. నల్ల గొండ జిల్లాకు చెందిన రాఘవరెడ్డి ఈ దేవాలయాన్ని నిర్మించారని చరిత్ర చెబుతోంది.

ప్రేమ పేరిట యువతి మోసం

- యువకుడిని నమ్మించి రూ.16లక్షలు కాజేసిన వైనం
- తర్వాత ఆస్ట్రేలియాకు పరార్..
- కేసు నమోదు

తిమ్మాపూర్(మానకొండూర్): ప్రేమ పేరిట ఓ యువతి తిమ్మాపూర్‌కు చెందిన యువకుడిని మోసం చేసింది. రూ.16 లక్షలు తీసుకొని, పరారైంది. బాధితుడి తండ్రి, పోలీసుల వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన మాదన నాగరాజు యోగా నిమిత్తం ఈశా ఫౌండేషన్‌కు వెళ్లాడు. అక్కడే విశాఖపట్టణానికి చెందిన కమలసంధ్య ప్రియాంకతో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కొన్ని నెలలుగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల నాగరాజు ఆమెను ఇంటికి తీసుకువచ్చాడు. దీనికి అతని తండ్రి మల్లయ్య నిరాకరించాడు. దీంతో గ్రామంలోని ఓ ఇంట్లో కొన్ని రోజులు అద్దెకు ఉన్నారు. ఈ క్రమంలో నాగరాజు ఓ ఆస్పత్రిలో తన భాగస్వామ్యాన్ని రద్దు చేసుకోవడంతో రూ.16 లక్షలు వచ్చాయి. ప్రియాంక తెలివిగా ఆ మొత్తాన్ని తన బంధువుల ఖాతాలోకి పంపించుకుంది. తర్వాత ఆస్ట్రేలియాకు పరారైంది. మళ్లీ రూ.3 లక్షలు కావాలని అతన్ని కోరింది. అంతేకాకుండా, నీ తండ్రి పేరిట ఉన్న భూమిని నీ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుంటే వచ్చి, పెళ్లి చేసుకుంటానని చెప్పింది. దీంతో డబ్బులు, భూ రిజిస్ట్రేషన్ కోసం అతను తండ్రిపై ఒత్తిడి తీసుకువచ్చాడు. భరించలేకపోయిన మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రియురాలి మోసం, తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మనస్తాపానికి గురైన నాగరాజు ఇటీవల ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించి, చికిత్స అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. శనివారం తండ్రీకొడుకు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు ప్రియాంకపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

బొలెరో ఢీకొని వ్యక్తి దుర్మరణం


సమ్మయ్య (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట(హుజూరాబాద్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన మండల సమ్మయ్య(60) శనివారం పని నిమిత్తం సైకిల్‌పై శాలపల్లి ఇందిరానగర్ వెళ్లాడు. తిరిగి వస్తుండగా జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. సమ్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు.

వాహన యజమాని ఇంటి ఎదుట ధర్నా

సమ్మయ్యను ఢీకొన్న వాహనం జమ్మికుంట పట్టణంలోని ఓ ఐరన్ షాపు యాజమానికి చెందినది. దీంతో మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు మృతదేహంతో అతని ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. కానీ, యజమాని అప్పటికే తన కుటుంబసభ్యులతో కలిసి తిరుపతి వెళ్లాడు. ప్రమాద విషయం తెలిశాక బాధితులతో ఫోన్‌లో మాట్లాడాడు. పరిహారం ఇచ్చేందుకు ఒప్పందం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. మృతుడికి భార్య యాదక్క, నలుగురు కుమారులు ఉన్నారు. కాగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుజూరాబాద్ టౌన్ సీఐ రమేశ్, జమ్మికుంట ఎస్సై రాజేశ్, ఇల్లందకుంట ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఠాణాలో ఆత్మహత్యాయత్నం

- అడ్డుకోవడంతో తప్పిన ప్రాణాపాయం
- చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఘటన
- పోలీసులు వేధిస్తున్నారని ఆరోపణ
- చందుర్తి సీఐ హామీతో వెనుదిరిగిన బాధితుడి కుటుంబం


యువకుడి చేతిలో నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కుంటున్న హెడ్ కానిస్టేబుల్, కుటుంబ సభ్యులు

చందుర్తి(వేములవాడ): పోలీసులు ఆరు నెలలుగా వేధిస్తున్నారంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఎన్గల్ గ్రామానికి చెందిన మ్యాకల జలంధర్ శనివారం పురుగుల మందు తాగేందుకు యత్నించాడు. అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది ఒకరు అడ్డుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడు జలంధర్ వివరాల ప్రకారం.. ఎన్గల్‌కు చెందిన మ్యాకల జలంధర్‌కు అదే గ్రామానికి చెందిన గుంటి మల్లేశంల మధ్య ఇళ్ల స్థలాల సరిహద్దు వివాదం 8 నెలలుగా కొనసాగుతోంది. అప్పుడే పోలీసులను ఆశ్రయించగా.. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ చేసుకోవాలని సూచించారు. పంచాయితీ పెద్దల తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ గుంటి మల్లేశం నవంబర్‌లో పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించనా వినిపించుకోలేదు. పంచాయితీ పెద్దల తీర్మానానికి కట్టుబడి ఉంటానని మ్యాకల జలంధర్ పోలీసులకు చెప్పగా.. పంచాయితీ చెప్పిన పెద్ద మనుషులపైనే కేసు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. దీంతో ఈ ఏడాది జనవరి 10న జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్‌కు ఠాణాదివస్‌లో ఫిర్యాదు చేయడంతో కొద్ది రోజులు వివాదం సద్దుమణిగింది. తిరిగి నెల రోజులుగా తనను పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తూ కేసు నమోదు చేస్తామంటూ పోలీసులు వేధిస్తున్నారంటూ ఏప్రిల్ 8న మళ్లీ జిల్లా ఎస్పీని కలిసిన జలంధర్ తన గోడు వెల్లబోసుకున్నాడు. ఎస్పీ ఆదేశాలతో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు గ్రామంలో విచారణ చేపట్టి, ఎవరి హద్దుల్లో వారు ఉండాలని ఆదేశించారు. అయితే ఇటీవల జలంధర్‌ను ఎస్సై ఠాణాకు పిలిపించి సాయంత్రం వరకు ఉంచుకొని వదిలేశాడని, అదేరోజు గుంటి మల్లేశం ఆ స్థలంలో రాళ్లతో హద్దు వేశాడన్నారు. దీనిపై ఏప్రిల్ 25న తిరిగి ఎస్పీకి ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ స్థలం విషయంలో ఎస్సై వేధిస్తున్నాడని జలంధర్ ఆరోపించారు. మల్లేశం ఫిర్యాదు చేయడంతో ఠాణాకు పిలిపిస్తూ ఇబ్బందులు పెడుతున్నాడని, తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. శనివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో తమను పోలీస్ స్టేషన్‌కు పిలుపించుకోగా.. మల్లేశం నిర్మాణ పనులు చేయించేందుకు ఇసుక పోయించాడని తెలిపారు. తాము ఇంటికి వెళ్లగానే ఇసుక కనిపించడంతో తల్లి ఎల్లవ్వ, చెల్లె పావనితో కలిసి పురుగుల మందు డబ్బాతో ఠాణాకు వచ్చినట్లు వివరించాడు.

కోనరావుపేట ఎస్సైకి విచారణ బాధ్యతలు

చందుర్తి ఎస్సై శ్రీకాంత్‌పై తమకు నమ్మకం లేదని, గ్రామానికి వచ్చినప్పుడల్లా మల్లేశంను వెంటేసుకొని తిరుగుతున్నాడని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు ఎదుట బాధితుడు జలంధర్ ఆరోపించాడు. దీంతో విచారణ బాధ్యతలను కోనరావుపేట ఎస్సై ఆంజనేయులుకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఇంటికి వెళ్లారు.